క్లుప్తంగా

బతుకమ్మ వేడుకలు



సంగెం : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు, అధ్యాపకులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి తెలంగాణ సంస్కృతి ప్రతిబింబేలా ఆడిపాడారు. విద్యార్థులకు యూడీసీ సుధీర్‌కుమార్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాధవరావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సన్మానం



వర్ధన్నపేట : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై బానోత్ చందర్‌ను బీఆర్ఎస్, బీజేపీ నాయకులు శుక్రవారం సన్మానించారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఎస్సైను తొలుత వేర్వేరుగా మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందజేశారు. అనంతరం శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమాల్లో నాయకులు తూల్ల కుమారస్వామి, మార్గం భిక్షపతి, సిలువేరు కుమారస్వామి, ఏరుకొండ వేణుగోపాల్‌రావు, ఆరెల్లి అంజన్‌రావు, కొండేటి శ్రీనివాస్, పిట్టల రాజు, గబ్బెట బాబు, కిషన్‌రావు, కొండేటి సత్యం, ఐత రవి, పెద్దూరి రాజ్‌కుమార్, దేవేందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.1.60 లక్షలు

గీసుకొండ : మండలంలోని కొమ్మాల లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి హుండీల ద్వారా రూ.1.60 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శేషగిరి తెలిపారు. ఆలయంలో హుండీలను దేవాదాయ శాఖ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ పర్యవేక్షణలో శుక్రవారం లెక్కించారు. ఈ సందర్భంగా ఈఓ శేషగిరి వివరాలు వెల్లడించారు. మొత్తం లక్ష 60 వేల 532 రూపాయలు సమకూరిందని వివరించారు. కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు, అర్చకులు పాల్గొన్నారు.

'ప్రైవేట్ స్కూళ్లలో సెలవుల్లోనూ తరగతులు'

నర్సంపేట : పట్టణంలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా దసరా సెలవుల్లోనూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాయని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్, ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా కార్యదర్శి జన్ను రమేశ్ తెలిపారు. పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించినా కొన్ని ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుండగా డీఈఓ, ఎంఈఓలకు సమాచారం ఇచ్చినా చర్యలు తీసుకోవడం లేదని చెప్పారు. కలెక్టర్ తక్షణమే స్పందించి నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పరామర్శ



రాయపర్తి : మహబూబాబాద్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్‌ను అతడి తండ్రి కేవ్లానాయక్ ఇటీవల మృతి చెందిన క్రమంలో మండలంలోని బాలాజీ తండాలోని నివాసంలో బీఆర్ఎస్ అగ్రనేత, మాజీ మంత్రి హరీశ్‌రావు శుక్రవారం పరామర్శించారు. తొలుత హరీశ్‌రావుతోపాటు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ మాలోతు కవిత, మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, తదితరులు కేవ్లానాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం శంకర్‌నాయక్‌ను హరీశ్‌రావు, నాయకులు పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్, ఏనుగుల రాకేశ్‌రెడ్డి, రావుల శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏనుగల్‌లో..

పర్వతగిరి : మండలంలోని ఏనుగల్‌కు చెందిన పాలికోజు శంకరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు ఆరూరి రమేశ్ శుక్రవారం పరామర్శించారు. తొలుత శంకరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు కుడికాల శ్రీధర్, పట్టాపురం ఏకాంతం గౌడ్, జిల్లా నాయకులు వనంరెడ్డి, గూడ నరేందర్ వర్మ, తొర్రి లక్ష్మణ్ యాదవ్, కట్రోజు రాజు, బొట్ల మధు, విశ్వబ్రాహ్మణ కుల సంఘం అధ్యక్షుడు అరిగెల రామకృష్ణ, రమేశ్, సుమన్, రాజు, హరీశ్, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీలో సమస్యల తిష్ట

- తాగునీటికీ తండ్లాట
- 100 కుటుంబాలకి ఒకే చేతి పంపు
- 18 ఏళ్లుగా వసతుల కోసం ఎదురుచూపులు
- మున్సిపాలిటీలో విలీనమైనా నిర్లక్ష్యమే..!



కాలనీలో వర్షానికి బురదమయంగా మారిన రోడ్డు

నర్సంపేట రూరల్ : పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో సమస్యలు తిష్టవేశాయి. 18 ఏళ్ల క్రితం కాలనీ ఏర్పడినప్పటి నుంచి రోడ్లు, డ్రైనేజీ, ఇతర వసతుల కోసం కాలనీవాసులు ఎదురుచూస్తూనే ఉన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకున్న దాఖలాల్లేవన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన క్రమంలో ఇకనైనా సమస్యలు పరిష్కారం కావాలని ప్రజలు కాంక్షిస్తున్నారు.

నర్సంపేట మండలంలోని సర్వాపురం గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో 2006లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ కాలనీ ఏర్పాటు చేసింది. అప్పుడు కాంగ్రెస్ నుంచి సర్పంచ్‌గా గెలిచిన శీలం కవిత చొరవతో సుమారు 120 మంది పేదలకు ఉచితంగా స్థలాలు కేటాయించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారు. నాడు సుమారు 70 కుటుంబాలు ఇల్లు కట్టుకుని నివాసం ఏర్పాటు చేసుకోగా ప్రస్తుతం 100 కుటుంబాలకు చేరింది. కాలనీలో రోడ్లు, డ్రైనేజీల సౌకర్యం లేదు. వర్షాకాలం రోడ్లన్నీ బురదమయమై ప్రజలు నడవడానికి నరకం అనుభవిస్తున్న దుస్థితి నెలకొంది. పలుమార్లు ప్రమాదాలూ జరిగి పలువురు గాయాల పాలయ్యారు. బీఆర్ఎస్ పాలనలో సమస్యలను అధికారుల, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న దాఖలాల్లేవని స్థానికులు బహిరంగంగానే మండిపడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కాలనీ వైపు కన్నెత్తి చూసిన దాఖలాల్లేవని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మిషన్ భగీరథ పైపులైన్ వేయగా పైపులు పగిలిపోయి మూడు నెలలుగా నీరు అందడం లేదు. కాలనీలోని సుమారు 100 కుటుంబాలకు ఒకే ఒక చేతి పంపు ఆధారం. 2013లో గ్రామ స్థాయి నుంచి అప్‌గ్రేడ్ అయి మున్సిపాలిటీలో కలిసినా కాలనీలోని సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటివరకు పట్టించుకోలేదని ప్రజలు మండిపడుతున్నారు. వర్షాకాలంలో రోడ్లపై నుంచి రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు తెలిపారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలోనూ మున్సిపల్ అధికారులు కనీసం బ్లీచింగ్ పౌడర్ చల్లడం, ఫాగింగ్ లాంటి పనులూ చేయలేదని తెలుస్తోంది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన క్రమంలో ఇకనైనా సమస్యలు పరిష్కారమై ఇందిరమ్మ కాలనీకి మహర్దశ పట్టాలని ప్రజలు ఆకాంక్షిసున్నారు.

బురదరోడ్లతో ఇబ్బంది



ఏటా వర్షాకాలంలో బురదరోడ్లపై నడవలేకపోతున్నాం. మోకాళ్లలోతు నీరు చేరుతుండడంతో ప్రమాదాలు సైతం చోటు చేసుకున్నాయి. విద్యార్థులు బడికి పోవాలన్నా భయపడుతున్నారు. ఇటీవల కురిసిన ఎడతెరిపి లేని వర్షాలకు కాలనీ నుంచి బయటకు రావాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాం.

-అన్నబోయిన వెంకన్న, కాలనీవాసీ

వసతులు కల్పించాలి



కాలనీకి వెళ్లే రోడ్డు గుంతలమయమైంది. రాత్రివేళల్లో ప్రమాదాలూ జరుగుతున్నాయి. పలువురు గాయాల పాలయ్యారు. గతంలో రోడ్లపై మొరం పోసి చేతులు దులుపుకున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి రోడ్లను లెవలింగ్ చేసి శాశ్వత ప్రాతిపదికన సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీలు నిర్మించాలి.

-ఇంజపూరి సుమన్, కాలనీవాసి

పైపులకు వెంటనే మరమ్మతు చేయించండి



గత ప్రభుత్వం కాలనీలో మిషన్ భగీరథ పైపులైన్ ఏర్పాటు చేయగా మూడు నెలలకు పైపులు పగిలిపోయాయితక్షణమే మిషన్ భగీరథ పైపులకు మరమ్మతులు చేయించి కాలనీకి తాగునీటి సమస్యను పరిష్కరించాలి.

-అల్లె నర్సయ్య, కాలనీవాసి

త్వరలో అన్ని సమస్యలు పరిష్కరిస్తాం

పట్టణ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో నెలకొన్న అన్ని సమస్యలు పరిష్కరిస్తాం. త్వరలో కాలనీని పరిశీలిస్తాం. రోడ్లు, సైడ్ డ్రైనేజీ, ఇతర సమస్యలు మా దృష్టికి వచ్చాయి. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార దిశగా చొరవ తీసుకుంటా.

-రాజేశ్, ఏఈ, మున్సిపాలిటీ

కాంగ్రెస్‌లో 'పేకాట' కలకలం!

- రెండు గ్రూపుల మధ్య కోల్డ్‌వార్

గీసుకొండ : మండల కాంగ్రెస్‌లో రెండు గ్రూపుల మధ్య 'పేకాట' కలకలం రేపింది. కొమ్మాల అంగడి సమీపంలో కాంగ్రెస్‌కు చెందిన 8 మంది పేకాటరాయుళ్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 30,780 నగదు, పేక ముక్కలు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని గురువారం కేసు నమోదు చేశారు. ఈ విషయంలో పోలీసులకు పలువురు కాంగ్రెస్ నాయకులు ఫోన్ చేసి తమ వాళ్లను రక్షించుకునే ప్రయత్నాలు చేశారని తెలుస్తోంది. ఈ క్రమంలో కాంగ్రెస్‌లోని ఓ సామాజిక వర్గానికి చెందిన నాయకుడు పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేసిన విషయాన్ని పలు వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేసి, వారిని అప్రతిష్టపాలు చేయడానికి ప్రయత్నిచారన్న విషయం వైరల్‌గా మారి వివాదం నెలకొంది. మూడు దశాబ్దాలుగా ఇద్దరు నాయకుల మధ్య తీవ్ర వివాదం నెలకొంది. వారు వేర్వేరు పార్టీల్లో ఉండి కత్తులు దూసుకున్నారు. కొంతకాలంగా ఒకే పార్టీలో చేరి కలిసి ఉన్నట్లుగానే ఉన్నా అంతర్గతంగా వారి మధ్య వివాదాలు నెలకొన్నాయి. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి కార్యక్రమాలకు హాజరవుతున్నా.. వేర్వేరు గ్రూపులుగానే కొనసాగుతున్నారు. గ్రూపుల విషయం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మరో వైపు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికికి తెలిసినా వారు మిన్నకుండి పోవడంపై పలు సందేహాలు వ్యక్తమవుతన్నాయి. విలేకరుల సమాచారం మేరకే కేసు నమోదు చేశారని గురువారం రాత్రి కొమ్మాల స్టేజీ వద్ద నందనాయక్‌తండాకు చెందిన కాంగ్రెస్ నాయకుడు, పేకాడుతూ పట్టుబడిన ధర్మసోతు వీరన్న ఆరోపించారు. విలేకరులను బాధ్యులను చేసి చంపుతానని ప్రజల మధ్యలో బాహాటంగా బెదిరించడం కలకలం రేపింది. ప్రత్యక్షంగా విషయం తెలిసిన వారెవ్వరూ ఈ వ్యవహారంపై నోరు మెదపడం లేదు. కాగా, తమను చంపుతామని బెదిరిస్తున్న వీరన్నపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రెస్‌క్లబ్ సభ్యులు పోలీసులను కోరినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా పేకాట వార్త తెలియకుండా కొమ్మాల, నందనాయక్‌తండా, విశ్వనాథపురం గ్రామాలకు వెళ్లే పలు దినపత్రికల ప్రతులను కొందరు దాచి పెట్టినట్లు గ్రామస్తులు తెలిపారు.

ఎర్రబెల్లిని ఎందుకు ఓడించారు?



సెల్ఫీ దిగుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

- ఊకల్ వాస్తులతో మాజీ మంత్రి హరీశ్‌రావు

రాయపర్తి : రోడ్లు వేయించిన ఎర్రబెల్లి దయాకర్‌రావును ఎందుకు ఓడించారని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. మహబూబాబాద్ జిల్లాలోని తొర్రూరు మండల కేంద్రంలో జరిగిన ఆందోళనకు హాజరైన అనంతరం ఊకల్‌లో రావుల శ్రీధర్‌రెడ్డి ఇంటిలో ఏర్పాటు చేసిన తేనేటి విందులో ఆయన పాల్గొని బయటకు వస్తుండగా ఫొటోలు దిగుతామని చిన్నారులు, మహిళలు హరీశ్‌రావును కోరారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు వారితో ఆయన సెల్ఫీ దిగారు. అనంతరం అక్కడ ఉన్న స్థానికులతో హరీశ్‌రావు మాట్లాడారు. మీ ఇళ్ల వరకు రోడ్లు వేయించిన దయాకర్‌రావును ఎందుకు గెలిపించలేదని అడిగారు.

ఆలయాల అభివృద్ధే పాలకవర్గ ధ్యేయం



ప్రమాణస్వీకారం చేయిస్తున్న దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సమత

నెక్కొండ : ఆలయాల అభివృద్ధే పాలకవర్గాల ధ్యేయమని టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజీత్ రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని శ్రీ రామలింగేశ్వర, అభయాంజనేయ స్వామి ఆలయాల్లో నూతన పాలకవర్గాలతో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సమత ప్రమాణస్వీకారం చేయించారు. శ్రీరామలింగేశ్వర ఆలయ పాలకవర్గ చైర్మన్‌గా కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి, సభ్యులుగా గుంటుపల్లి ప్రభాకర్‌రావు, కొత్త కొండ గణేశ్, రాపాక అనిల్, కొంగర హైమావతి, ఎక్స్ అఫీషియో సభ్యుడుగా (అర్చకుడు) బీవీఎస్.శాస్త్రీ ప్రమాణస్వీకారం చేశారు., శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయ పాలకవర్గ చైర్మన్‌గా బెజ్జంకి వెంకటేశ్వర్లు, సభ్యులుగా సోమ సత్తిరెడ్డి, దేవనబోయిన వీరస్వామి, కక్కెర్ల శ్రీనివాస్, కొలకనూరి యాకలక్ష్మి, ఎక్స్ అఫీషియో సభ్యుడుగా (అర్చకుడు) బూర్గుపల్లి భవిశాస్త్రీ ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి రంజీత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆలయాలు భక్తి చింతనకు, మానసిక ప్రశాంతతకు నిలయాలుగా విలసిల్లాలని ఆకాంక్షించారు. ఆ దిశగా పాలకవర్గాలు పని చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ కమిటీల అధ్యక్షులు బక్కి అశోక్, పెండ్యాల హరిప్రసాద్, నాయకులు కుసుమ చెన్నకేశవులు, సుబ్బారెడ్డి, శివకుమార్, గంధం రాజు, సింగం ప్రశాంత్, సూర్యనారాయణ, శ్రీనివాస్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



నర్సంపేట : అమ్మవారికి పూజ చేస్తున్న భక్తులు

సాక్షి నెట్‌వర్క్ : నర్సంపేట నియోజకవర్గవ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం కొనసాగాయి. నర్సంపేటలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో అమ్మవారు గాయత్రిదేవి అవతారంలో దర్శనమిచ్చారు. అమ్మవారిని భక్తులు ధనలక్ష్మి రూపంలో అలంకరించి పూజలు చేశారు. సాయంత్రం మహిళలు సామూహిక లలిత పారాయణం, కుంకుమ పూజ, ధనలక్ష్మి పూజ, పల్లకి సేవ నిర్వహించారు. పదో వార్డు పరిధిలోని పోచమ్మ ఆలయంలో దుర్గామాత అమ్మవారికి స్థానిక కౌన్సిలర్ నాగిశెట్టి పద్మ ప్రసాద్, పోచమ్మ తల్లి మహిళా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అర్చకుడు నిశాంత్‌శర్మ పూజలు నిర్వహించారు. చెన్నారావుపేట మండలంలోని మాధవనగర్ కాలనీలో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నల్లబెల్లి మండల కేంద్రంలోని వాగ్దేవి కళా సంస్థ, నారక్కపేటలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంటపాల్లో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఓదెల విజయ–వీరస్వామి దంపతులు, అర్చకులు కడివెండి గణేశ్ శర్మ, ఉప్పునూతుల ప్రభాకరస్వామి, వీరభద్రచార్యులు పూజించారు. దుగ్గొండి మండలంలో దుర్గాదేవి బాలాత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. నాచినపల్లిలోని రామాలయంలో అర్చకుడు రమేష్‌మూర్తి, దేవాదాయ కమిటీ ఆధ్వర్యంలో మహాహోమం నిర్వహించారు. భక్తులు భజన చేశారు. వర్ధన్నపేటలోని దుర్గామత మండపంలో అమ్మవారు లక్ష్మీదేవిగా దర్శనమిచ్చింది. అర్చకులు కలకోట శ్రావణ్‌కుమారచార్యులు, రామాచర్యులు మహిళా భక్తులతో అమ్మవారికి కుంకుమార్చన చేయించారు. సంగెం మండలంలోని గవిచర్లలోని గుండబ్రహ్మయ్య ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన మండపంలో అమ్మవారు బాలత్రిపుర సుందరీ అలంకరణలో దర్శనమిచ్చారు. పలువురు భక్తులు భవానీ మాత మాల ధారణ చేశారు.

డీజే నిషేధం



గీసుకొండ : మండలంలో డీజేను నిషేధించినట్లు సీఐ బాబులాల్ స్పష్టం చేశారు. ఇక నుంచి అధిక సౌండ్‌తో డీజే పెడితే బాధ్యులను చట్టప్రకారం జైలుకు పంపుతామని ఆయన హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో డీజే నిర్వాహకులకు శుక్రవారం ఆయన కౌన్సెలింగ్ చేశారు. తొలుత తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. అధిక సౌండ్‌తో డీజే పెట్టడాన్ని నిషేధించినట్లు తెలిపారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి డీజే పెడితే ఏడాది జైలుతోపాటు లక్ష రూపాయల జరిమానా విధిస్తామని తెలిపారు.

సమర్థవంతంగా సర్వే నిర్వహించాలి

- నర్సంపేట ఆర్‌డీఓ కృష్ణవేణి



దుగ్గొండి : సర్వేను పరిశీలిస్తున్న ఆర్‌డీఓ కృష్ణవేణి

దుగ్గొండి : అధికారులు, సిబ్బంది ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని నర్సంపేట ఆర్‌డీఓ కృష్ణవేణి కోరారు. పైలట్ ప్రాజెక్టు కింద మండలంలోని మదిరలో చేపట్టిన సర్వేను శుక్రవారం ఆమె ప్రత్యక్షంగా పరిశీలించి సూచనలు, సలహాలు అందించారు. పాత రేషన్ కార్డుల్లో అవసరం లేని పేర్లు ఉంటే తొలగించాలని, కొత్తగా కోడళ్లు, ఇతరులు ఎవరైనా చేరితో నమోదు చేయాలని చెప్పారు. సర్వేలో ఎలాంటి నిర్లక్ష్యమూ తగదని స్పష్టం చేశారు. వివరాలను క్షుణ్ణంగా తెలుసుకుని నమోదు చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవిచంద్రారెడ్డి, ఎంపీడీఓ అరుంధతి, ఎంపీఓ శ్రీధర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శులు ప్రవీణ్, కవిత పాల్గొన్నారు.

సంగెం : మండలంలోని కృష్ణానగర్‌లో సర్వేను తహసీల్దార్ గనిపాక రాజ్‌కుమార్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇక అన్నిటికీ ఫ్యామిలీ డిజిటల్ కార్డే ఆధారం కానుందని చెప్పారు. మహిళల పేరుతోనే డిజిటల్ కార్డు జారీ చేస్తామన్నారు. ప్రజలు అన్ని వివరాలూ అందించి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కాసర్ల రవీందర్, పంచాయతీ కార్యదర్శి ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.

ఎగ్ కార్ట్ బండ్లతో యువతకు ఉపాధి



ఎగ్ కార్ట్ బండిని ప్రారంభిస్తున్న నాయకులు

పర్వతగిరి : ఎగ్ కార్ట్ బండ్లతో నిరుద్యోగ యువతకు ఉపాధి లభించనుందని బీఆర్ఎస్ నాయకులు, మాజీ సర్పంచ్‌లు విజయ సంపత్, బొట్ల కిష్టయ్య తెలిపారు. మండల కేంద్రానికి చెందిన కూరపాటి తులసమ్మ, చిరుకొండ నర్సయ్య, నెదునూరి విజయలక్ష్మి, పెండ్యాల నవీన్‌లకు నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ (ఎన్ఈసీసీ) అందజేసిన ఎగ్ కార్ట్ బండ్లను శుక్రవారం విజయ సంపత్, కిష్టయ్య ప్రారంభించి మాట్లాడారు. ఎన్ఈసీసీ అధ్యక్షుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ఎగ్ కార్ట్ బండ్లను మంజూరు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ ఆదొండ భిక్షపతి, మాజీ వార్డు సభ్యులు కంటెం ఏకాంతం, కొండ వెంకటేశ్వర్లు, నూనె ఏకాంతం, చీదురు తిరుపతి, రైతు సంఘం గ్రామ కమిటీ అధ్యక్షుడు జూలపెల్లి దేవేందర్‌రావు, అంబేడ్కర్ సంఘం పట్టణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ జిల్లా శ్రీనివాస్, యువజన విభాగం అధ్యక్షుడు బూర శ్యామ్, సోషల్ మీడియా మండల కన్వీనర్ బొట్ల భాస్కర్, నాయకులు షంషుద్దీన్, బాసాని భిక్షపతి, చిన్నపెల్లి దేవేందర్, పుల్లూరి రంజిత్, చిర్ర సునీల్, చిన్నపెల్లి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా

చెన్నారావుపేట : మండలంలోని గొల్లపల్లి గ్రామ శివారులో శుక్రవారం సాయంత్రం ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడింది. గ్రామానికి చెందిన గొస్కుల ప్రభాకర్ తన మొక్కజొన్న లోడ్‌ను నర్సంపేటలోని మార్కెట్‌కు చేర్చి వస్తుండగా గ్రామ శివారులో కారు ఎదురుగా రావడంతో తప్పించే క్రమంలో ప్రమాదం చోటు చేసుకుంది. డ్రైవర్ అప్రమత్తంగా ఉండడంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు.

ఝాన్సీరెడ్డి కోలుకోవాలని పూజలు



ఆలయంలో పూజ చేస్తున్న నాయకులు

రాయపర్తి : కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి త్వరగా కోలుకోవాలని కోరుతూ మండలంలోని సన్నూరు గ్రామంలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆ పార్టీ నాయకులు పూజలు చేశారు. షాపింగ్ మాల్ ప్రారంభంలో స్టేజీ కూలి ఝాన్సీరెడ్డి గాయాలపాలైన విషయం తెలిసిందే. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

'సంక్షేమ బోర్డును ప్రైవేట్ సంస్థకు అప్పగించొద్దు'



సమావేశంలో మాట్లాడుతున్న సాగర్

సంగెం : కార్మిక సంక్షేమ బోర్డును ప్రైవేట్ సంస్థకు అప్పగించొద్దని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మాలోత్ సాగర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన భవన నిర్మాణ రంగ కార్మికుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్మికులకు పెండింగ్‌లో ఉన్న క్లెయిములను తక్షణమే మంజూరు చేయాలని, రెన్యూవల్ కాని కార్డుల్లోని సమస్యలు పరిష్కరించాలని, దళారీ వ్యవస్థను అరికట్టాలని, స్థానిక కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈనెల 20న తలపెట్టిన మహాసభకు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకుడు ఓదెలు, కార్మిక సంఘం మండల అధ్యక్షుడు సమ్మయ్య, నాయకులు సాంబయ్య, శోభన్‌బాబు, ప్రకాశ్ బాబు, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.


గుడుంబా స్థావరాలపై దాడి

చెన్నారావుపేట : మండలంలోని అక్కల్‌చెడ గ్రామ శివారులోని లచ్చినాయక్ తండాలోని గుడుంబా స్థావరాలపై ఏఎస్ఐ లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది శుక్రవారం దాడి నిర్వహించారు. జాటోతు భద్రు తయారు చేసిన 80 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి 10 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. భద్రుపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

నివాళి

సంగెం : ఢిల్లీ శివారులో జరిగిన ఉద్యమంలో అమరులైన రైతులకు మండలంలోని కుంటపల్లిలో ఏఐకేఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్ ఆధ్వర్యంలో శుక్రవారం కొవ్వొత్తులతో నివాళులర్పించారు. అనంతరం ఇస్మాయిల్ మాట్లాడారు. నాటి ఉద్యమ సందర్భంగా రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐకేఎఫ్ జిల్లా కార్యదర్శి గోనె రాంచందర్, నాయకులు జక్క అశోక్, రౌతు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ సామాజిక బాధ్యత



ఖానాపురం : వన్యప్రాణుల సంరక్షణను సామాజిక బాధ్యతగా నర్సంపేట ఎఫ్ఆర్ఓ రవికిరణ్ అభివర్ణించారు. మండలంలోని పాకాలలో శుక్రవారం నిర్వహించిన వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణులకు ఆటంకాలు కలిగించడం నేరమని చెప్పారు. వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఎవరైనా వన్యప్రాణులను వేటాడితే అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ సోమ, బీట్ అధికారులు రమేశ్, సునీత, సుదర్శన్, నార్య, కిరణ్, ఏకో టూరిజం అధికారులు విజయ్, జయప్రకాశ్, రవి, మహేశ్, రాజు పాల్గొన్నారు.